క్లుప్తంగా

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

కామవరపుకోట: ఎంపీ నిధులు రూ.10 లక్షలతో స్థానిక వీరభద్ర కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్ సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రిపోతు అనూష, ఉప సర్పంచ్ మేడూరి రంగబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్, వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజా, ఎంపీటీసీలు బొల్లు సత్యనారాయణ, పోలిమెట్ల ప్రశాంత్, రాష్ట్ర ముదిరాజు సంఘ డైరెక్టర్ చిక్కుళ్ల శ్రీను, గంట భాస్కరావు, సిద్దురాజు, గుమ్మడి లక్ష్మణ నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో..



కుటుంబ సమేతంగా పూజలు నిర్వహిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వరరావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని శ్రీకాకుళం (క్రైమ్) అడిషినల్ ఎస్పీ విఠలేశ్వరరావు సోమవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

ఏసుక్రీస్తు ప్రేమాలయ నూతన మందిర ప్రతిష్ట



ఏసుక్రీస్తు ప్రేమాలయ నూతన మందిరాన్ని ప్రారంభోత్సవం చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: చింతకొండ కొండరెడ్డి గిరిజన గ్రామంలో ఏసుక్రీస్తు ప్రేమాలయ నూతన మందిర ప్రతిష్ట కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ మందిరాన్ని ఫెలోషిప్ పాస్టర్ల చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం క్రీస్తు సందేశాన్ని అందించారు. ఆర్కెస్ట్రా ద్వారా ఆలపించిన క్రైస్తవగీతాలు అలరించాయి. పాస్టర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ ఆకుల శాస్త్రి, సెక్రటరీ కె.డానియెల్, బాడీ కమిటీ మెంబర్స్, దావీదు, బషీర్‌పాల్, జంగారెడ్డిగూడెం చర్చ్ పాస్టర్ పీటర్‌సన్, చింతకొండ సంఘకాపరి కోండ్రు కార్తిక్, సంఘస్థులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలించే వారిపై చర్యలు



జీలుగుమిల్లి సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించిన డీఎస్పీ రత్నరాజు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): అంతరరాష్ట్ర చెక్ పోస్టుల వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచడం జరుగుతుందని పోలవరం డీఎస్పీ జి.రత్నంరాజు తెలిపారు. పోలవరం డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన మొదటిసారి జీలుగుమిల్లి సర్కిల్ కార్యాలయాన్ని, పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని కేసుల వివరాలను ఆయా గ్రామాల్లోని స్థితి గతులను సీఐ బి. వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు, అనుమానితుల కదలికలపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంటుందని అన్నారు. అలాగే లక్ష్మీపురం రమణక్కపేట సమీపంలో రహదారిపై రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. ఎస్సై ఐ.చంద్రశేఖర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి విర్డ్‌లో ప్రత్యేక వైద్యశిబిరం

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో ఈనెల 19, 20 తేదీల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. ప్రముఖ హ్యాండ్ సర్జన్ డాక్టర్ భాస్కరానంద్ కుమార్‌చే ఈ క్యాంప్ నిర్వహించ బడుతుందన్నారు. పుట్టుకతో వచ్చిన చేతి సమస్యలు, పోలియో, అన్ని రకాల చేతి సమస్యలు ఉన్నవారు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో నిర్దేశించిన వైద్య సేవలను ఉచితంగా అందిస్తామన్నారు. ఈ వైద్య సేవలను పొందే వారు ముందుగా 85002 63149 నంబర్‌కు ఫోన్ చేసి, తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కమనీయం.. సుబ్బారాయుడి కల్యాణం

చింతలపూడి: సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించారు. స్వామిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు క్యూ కట్టారు. చుట్టు పక్కల గ్రామాల నుంచే కాక, హైదరాబాద్, నాగపూర్ నుంచి కూడా భక్తులు వచ్చి ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ప్రత్యక్ష సుబ్రహ్మణ్యేశ్వర స్వామిగా భక్తులు స్వామివారిని కొలుస్తారు. ఆలయ కమిటీ భక్తుల కోసం దాతల సహకారంతో భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా షష్ఠి సందర్భంగా ఏటా చెన్న కేశవస్వామి సేవను భక్తులు చేస్తారు. కుణతాలు ధరించిన బృందం భక్తుల మొక్కులను చెన్నకేశవస్వామి సన్నిధిలో తీరుస్తారు. విద్య, ఆరోగ్యం, సంతానం వంటి మొక్కులను భక్తులు మొక్కుకుని షష్ఠి రోజున మొక్కులు తీర్చుకుంటారని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు.

శ్రీవారి క్షేత్రంలో అట్టహాసంగా వేడుక

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమైన చెరువు వీధిలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణస్వామి సుబ్రహ్మణ్యేశ్వరుడికి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, సుబ్రహ్మణ్యేశ్వరుని నామస్మరణల నడుమ ఆలయ అర్చకులు, పండితులు వేదమంత్రోచ్ఛరణలతో స్వామివారి మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. కల్యాణ మహోత్సవం అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకి వాహనంలో ఉంచి క్షేత్ర పురవీధుల్లో ఊరేగించారు.



టి.నరసాపురం: కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామికి కల్యాణం నిర్వహించిన దృశ్యం



పోలవరం: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలో భక్తుల పూజలందుకున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

కొయ్యలగూడెం: బయ్యనగూడెంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. కన్నాపురం, మంగపతిదేవిపేట, బోడిగూడెం, రాజవరం, నరసన్నపాలెంతోపాటు కొయ్యలగూడెంలోని కన్నాపురం రోడ్డులో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, తాడేపల్లిగూడెం రోడ్డులోని స్వయంభు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్ఠి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పుట్టలో పాలు పోసి పళ్లు నైవేద్యంగా సమర్పించారు.

టి.నరసాపురం: మండలంలో సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా టి.నరసాపురం కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ జ్యోతిర్లింగ నాగేశ్వరస్వామి ఉపాలయంలో శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌రాజు, లక్ష్మీ సౌజన్య దంపతులచే అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. చిన గుర్వాయిగూడెం, పెద్దగుర్వాయిగూడెంలలోని స్వామి ఆలయాల వద్ద కల్యాణోత్సవాలను నిర్వహించారు.

పోలవరం రూరల్: సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పోలవరం, పట్టిసీమ ఆలయాల వద్ద స్వామి వారికి కల్యాణ మహోత్సవాలు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. పోలవరంలో కొణతాల కుటుంబీకులు, పట్టిసం గ్రామంలో కొత్తగుండు సత్యసాయిబాబ కుటుంబీకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీ అయ్యప్ప స్వామి క్షేత్రంలో ఉపాలయంలో కొలువై ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో సుబ్బారాయుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ చామర్తి శ్రీరాములు, అయ్యప్ప ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: పట్టణంలో సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు ఘనంగా జరిగాయి. జంగారెడ్డిగూడెం అశ్వారావుపేట రోడ్డులోని సుందర బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో, లచ్చిరెడ్డి చెలకలో ఉన్న స్వయంభూ నాగమ్మదేవత ఆలయంలో, శ్రీనివాసపురం రోడ్డు, బుట్టాయగూడెం రోడ్‌లలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

బుట్టాయగూడెం: నందాపురంలో కొలువై ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక శివాలయంలో ఉన్న స్వామివారిని కూడా భక్తులు దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



ద్వారకాతిరుమల: సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెం: పూజలందుకున్న అశ్వారావుపేట రోడ్డులోని సుందర బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



కొయ్యలగూడెం: బయ్యనగూడెంలో స్వామి మూలవిరాట్ విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



చింతలపూడి: నాగిరెడ్డిగూడెంలో సుబ్బారాయుడి కల్యాణం జరుపుతున్న దృశ్యం

బ్రాహ్మణ పరిషత్ సమావేశం



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సభ్యులు

జంగారెడ్డిగూడెం: స్థానిక పేరంపేట రోడ్డులోని శివాలయం వద్ద సోమవారం జంగారెడ్డిగూడెం ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2021 కార్తీక వనసమారాధన నాటి నుంచి విశేష సేవలందిస్తున్న కమిటీని 2025 కార్తీక వన సమారాధన వరకు కొనసాగించేందుకు బ్రాహ్మణ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతూ తీర్మానం చేసినట్లు తిప్పబట్ల రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలుకూరి సాయిబాబు, కూచిబట్ల రాము, నిడుమోలు చిరంజీవిరావు, లంకా నాగకుమార్, సమయమంత్రి రాధాకృష్ణ, కూచి త్రినాథరావు, గన్నవరపు మాధవరావు, మధనంబెడు కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగన్‌కే సాధ్యం

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమైందని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. సోమవారం సాగిపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు ఆధ్వర్యంలో ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఎగురవేసి అనంతరం గ్రామ సచివాలయ ఆవరణలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. గ్రామస్తులకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు గూర్చి వివరించి, కిట్లు అందజేశారు. సర్పంచ్ గుండుగోలు సుబ్బారావు, ఎంపీటీసీ బూరుగు శ్రీను, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

వెంకటాద్రిగూడెంలో...

చింతలపూడి: వెంకటాద్రిగూడెం సచివాలయంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం పరిధిలో ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి గురించి మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు వివరించారు. కుల, మత, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, ఈటీపీఆర్డీ విక్టర్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కామవరపుకోట: సాగిపాడులో బుక్‌లెట్‌లను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



చింతలపూడి: వెంకటాద్రిగూడెంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్

- బస్సుయాత్ర విజయవంతంతో పార్టీ నేతల్లో ఆనందం
- కార్యకర్తల్లో నూతనోత్సాహం

ద్వారకాతిరుమల: దేవరపల్లిలో ఆదివారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర సూపర్ సక్సెస్ కావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్ నింపింది. సభను విజయవంతం చేయడానికి గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ద్వారకాతిరుమల, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాల నేతలతో ఎప్పటికప్పుడు మాట్లాడారు. దాంతో నేతలు బస్సు యాత్రను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో జరిగిన బస్సు యాత్ర సభకు ఊహించిన దానికంటే ఎక్కువ మంది జనం రావడం క్యాడర్లో ఉత్తేజాన్ని నింపింది. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బస్సుయాత్ర పార్టీకి మంచి బలాన్నిచ్చిందని స్థానికంగా పలువురు చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలోని పలు పంచాయతీల్లో ఇటీవల జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న వై ఏపీ నీడ్స్ జగన్, జగనన్నకు చెబుదాం, జగనన్న ఆరోగ్య సురక్ష, నిరుపేదలకు భూపంపిణీ, ఆడుదాం ఆంధ్రా వంటి పలు కార్యక్రమాల ద్వారా ఎమ్మెల్యే తలారి నిత్యం జనంతో మమేకమవుతూనే ఉన్నారు. ఇలా ఎమ్మెల్యే ప్రజలకు బాగా దగ్గర కావడంతో పాటు, పార్టీ నేతలు కష్టపడి పనిచేయడం వల్ల సామాజిక సాధికార యాత్రకు జనం స్వచ్ఛందంగా హాజరైనట్టు రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో గ్రామాలకు వెళుతూనే ఉన్నారు. ఇవన్నీ బస్సు యాత్ర విజయానికి కారణమని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.



దేవరపల్లిలో ఆదివారం జరిగిన బస్సు యాత్రకు భారీగా హాజరైన జనం

విద్యుత్ సమస్యకు పరిష్కారం

కొయ్యలగూడెం: అచ్యుతాపురం పంచాయతీ పరిధిలో నెలకొన్న విద్యుత్ సరఫరా సమస్యకి పరిష్కారం లభించింది. పంచాయతీ పరిధిలోని త్రినాధపురం, శ్రీరంగపట్నం గ్రామాలలో నూతన విద్యుత్ పోల్స్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. సోమవారం పలుచోట్ల విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు గోపాలపురం మండలం నుంచి, కన్నాయిగూడెం బోడిగూడెం ఫీడర్ల నుంచి విద్యుత్తు సరఫరా అవుతూ ఉండేది. దీంతో తరచూ అవాంతరాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించిన సమయంలో సర్పంచ్ మద్దిపాటి నాగమణి, ఎంపీటీసీ మందపాటి కుమారి, విద్యుత్ సమస్యను ఎమ్మెల్యే బాలరాజు దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన ఆయన తక్షణ చర్యలు చేపట్టడానికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాకి సానుకూల వాతావరణం ఏర్పడింది.



నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ పోల్స్

ఆరోగ్యశ్రీ పరిమితి పెంపుపై హర్షం

జంగారెడ్డిగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 25 లక్షలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయంపై మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి హర్షం వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెంలోని మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మెగా ఆరోగ్యశ్రీ లైవ్ ప్రోగ్రామ్‌ను అధికారులతో కలిసి వారు వీక్షించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

జంగారెడ్డిగూడెం: ఒకరికొకరు సహాయంగా ఉంటూ సంఘ జీవన విలువలను కాపాడుకుందామని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. స్థానిక దండమూడి కళ్యాణమండపంలో డివిజన్‌స్థాయి సెమీక్రిస్మస్ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ తన తండ్రి కోటగిరి విద్యాధరరావు స్ఫూర్తితో రాజకీయాలకు వచ్చానని, ఆయన గౌరవం నిలబెట్టేలా నడుచుకుంటున్నానని చెప్పారు. ఈ ఐదేళ్ల పాటు ఎటువంటి మచ్చలేకుండా ఎంపీ సేవలందిస్తున్నానంటే అందుకు ప్రజలు, శ్రేయోభిలాషుల సహకారం ఎంతగానో ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అందరికీ సెమీక్రిస్మస్, న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలియజేశారు. పంతగాని వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏలూరు పీఠాధిపతి పొలిమెర జయరావు, వికార్ జనరల్ డాక్టర్‌ఫాదర్ పి.బాల, ప్రొడ్యూరేటర్ ఫాదర్ రాజు, దెందులూరు ఫాదర్ అమ్మన్‌రాజు, గెద్దం జాషువా, సిస్టర్ అమలారాణి, బీవీఆర్ చౌదరి, మండవల్లి సోంబాబు, ఎం.విద్యాసాగర్, డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.



సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ శ్రీధర్

పేదలకు రగ్గుల పంపిణీ

జంగారెడ్డిగూడెం: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని రిడీమ్ ఇండియా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సోమవారం పేదలకు 500 రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఫౌండర్, ప్రెసిడెంట్ ఆక్టర్ మనోహర్ జేమ్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పాస్టర్ జోసెఫ్ చిక్కాల మాట్లాడుతూ చలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అనాధలు, నిరాశ్రయులకు దుప్పట్లు, రగ్గులు అందజేశామన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్చిరాజు, కౌన్సిలర్ ఎల్. వెంకటేశ్వరరావు, గూడపాటి రాధాకృష్ణ, టి.సుబ్బారెడ్డి, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

మైనార్టీల హక్కులను తెలుసుకోండి



సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు

చింతలపూడి: భారత రాజ్యాంగంలో మైనార్టీల హక్కులను తెలుసుకుని నడుచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు అన్నారు. మైనార్టీ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జామియ మస్జిద్‌లో సోమవారం మైనార్టీల హక్కులపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ రాజ్యాంగంలో అందరికి సమాన హక్కులు కల్పించబడ్డాయని అన్నారు. మైనార్టీల హక్కులు, విధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనార్టీల కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలను గురించి వివరించారు. మైనార్టీలు తమ పిల్లలను చక్కగా చదివించి మంచి భవిష్యత్తును ఏర్పాటు చేయాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలపై నిత్యం అజమాయిషీ కలిగి ఉండాలని, ముఖ్యంగా సెల్‌ఫోన్లకు పిల్లలను దూరంగా ఉంచాలని చెప్పారు. పిల్లలకు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడానికి ఇవ్వరాదని కోరారు. సదస్సులో మస్జిద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ రహీం (బాబు), ప్రధాన కార్యదర్శి ఎండీ జిలాని, ఏపీపీ సామయ్య, న్యాయవాదులు డేవిడ్‌రాజు, ఉమర్ ఫరూఖ్, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలి తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి విరాళం

కామవరపుకోట: రామన్నపాలెంలోని రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చి నిర్మాణానికి ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, అశోక్ శ్రీనివాస్ దంపతులు రూ.50 వేల విరాళాన్ని సంఘ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ కడిమి రమేష్, ఉప్పలపాటి శ్రీనివాసరావు, అన్నపనేని రాజశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పద్యార్చన

కామవరపుకోట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అమ్మ, నాన్న, గురువు పద్యార్చన ఘనంగా నిర్వహించారు. తెలుగు సంఘాల సమన్వయంతో వందే విశ్వమాతరమ్ పేరుతో నిర్వహిస్తున్న శాంతి సద్భావన యాత్రలో భాగంగా చిగురుమళ్ళ శ్రీనివాస్ రచించిన అమ్మ, నాన్న, గురువు శతకాలలోని పద్యాలను కంఠస్థం చేసి 20 మంది విద్యార్థులు సామూహిక గానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రమాసుందరి మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రులు, గురువు పట్ల గౌరవం పెంచడానికి ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోరంకి నాగరాజు, సీహెచ్ కనక లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సీలింగ్ భూములను పేదలకు పంచాలి

జంగారెడ్డిగూడెం: సీలింగ్ భూములను పేదలకు పంచాలని రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. కేతవరం గ్రామంలో 85 ఎకరాల సీలింగ్ భూమి ఉందని, అది భూ వసతి లేని నిరుపేద, దళిత పేదలకు పంచాలని కోరారు. తహసీల్దార్ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులైన ప్రతి పేదవానికి తక్షణమే భూములను పంచాలన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు జొన్నకూటి వెంకటేశ్వరరావు, మడకం రామన్న, ఖాశీబాబు, మందపల్లి రాజు, గొన్నూరి ఆనందరావు, పాట్ల జయరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగు పట్టాలివ్వాలి

టి.నరసాపురం: ప్రభుత్వ భూములకు సాగు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. మంగళి మెట్టకు సాగుపట్టాలివ్వాలని, అల్లూరి సీతారామరాజునగర్‌కు విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించాలని వారు కోరారు. ఈ మేరకు సోమవారం టి.నరసాపురం తహసీల్దార్ జీవీ సుబ్బారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు మడకం సుధారాణి, వర్గాల లక్ష్మి, బరగడ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టంపై సోషల్ ఆడిట్

కొయ్యలగూడెం: మిచాంగ్ తుపాన్ వలన నష్టపోయిన రైతుల వివరాలకు సంబంధించి సోషల్ ఆడిట్ కార్యక్రమం చేపట్టినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు, ఉద్యాన శాఖ అధికారి ధీరజ్ లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండలంలో అన్ని గ్రామ సచివాలయ, ఆర్‌బీకే కేంద్రాలలో వ్యవసాయ, ఉద్యాన పంటలు నష్టపోయిన రైతుల జాబితాను ఈనెల 19, 20, 21 తేదీలలో ప్రదర్శించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ జాబితాలో రైతులకు ఎటువంటి అభ్యంతరాలు ఉన్న ఆర్‌బీకే కేంద్రంలో తెలియజేయాలన్నారు.

వేడుకగా శ్రీవారికి తిరువీధి సేవ



తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు, గోదాదేవి

ద్వారకాతిరుమల: ధనుర్మాస వేడుకల్లో భాగంగా శ్రీవారికి తిరువీధి సేవ క్షేత్ర పురవీధుల్లో సోమవారం అట్టహాసంగా జరిగింది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించిన తొళక్క వాహనంపై ఉంచి, అర్చకులు విశేష పూజలు జరిపారు. అనంతరం హారతులిచ్చారు. ఆ తరువాత ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా స్వామివారి వాహనం తిరువీధి సేవకు పయనమైంది. అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, డోలు, సన్నాయి వాయిద్యాలు, అశ్వ, గజ సేవల నడుమ శ్రీవారు క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ప్రతి ఇంటి ముంగిట భక్తులు స్వామివారికి నీరాజనాలు సమర్పించారు. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.